స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



2



2
ప్రబలిన అతిసార ఇద్దరు మృతి

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## 25న ఉద్యోగ మేళా

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 25న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్ తెలిపారు. ఇందులో బీఎఫ్ఐఎల్, పేటీఎం, ఎల్ఎన్ఆర్ బయోటెక్ కంపెనీలు నియామకాలు చేపడతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి ఎంబీఏ వరకు అభ్యసించిన వారు అర్హులన్నారు. కావున ఆసక్తి గల వారు జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ లో గల ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం వరకు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9948748428, 9959456793 సంప్రదించాలన్నారు.



## పెంపొందించడానికి బాలగంగాధర్ తిలక్ కృషి



**అక్షరటుడే, ఇందూరు:** దేశభక్తి జాతీయ భావాన్ని పెంపొందించడానికి బాలగంగాధర్ తిలక్ ఎంతో కృషి చేశారని న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్ తెలిపారు. బాలగంగాధర్ తిలక్ జయంతిని పురస్కరించుకొని బుధవారం తిలక్ గార్డెన్‌లో గల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాజ్యం నా జన్మ హక్కు అనే నినాదంతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పత్రికల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉధృతం చేశారన్నారు. జాతీయ సమైక్యత కోసం అందరినీ ఏకతాటిపై నడిపించడానికి సామూహిక గణేశ్ ఉత్సవాలను ప్రారంభించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పరిషత్ న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, నారాయణదాసు, వసంతరావు, కోటేశ్వర్ రావు, కేశవరావు, భానుచందర్ పాల్గొన్నారు.

## కోళ్లఫారాల తనిఖీ



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండలం హంగర్గ ఫారం గ్రామంలోని కోళ్ల ఫారాల్లో పోలీసులు దాడులు చేశారు. కోళ్లకు వేసే దాణాలో యూరియాను వాడుతున్నట్లుగా సమాచారం రావడం రావడంతో తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసే యూరియా వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో నిషిత, తహశీల్దార్ గంగాధర్, ఎస్సై సునీల్, యూత్ అధ్యక్షుడు చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు. కోళ్లఫారం తనిఖీల అనంతరం అధికారులు మాట్లాడుతూ.. యూరియాను రైతులు పంటసాగుకు మాత్రమే వాడాలని సూచించారు.

## మార్కెట్ కమిటీలకు నిధులు

**అక్షరటుడే, నిజాంసాగర్ :** జుక్కల్ నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీలకు నిధులు మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు చొరవతో నిధులు మంజూరైనట్లు పిట్లం ఏఎంసీ ఛైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ తెలిపారు. పిట్లం ఏఎంసీకి రూ.72 లక్షలు, బిచ్కుందకు రూ.1.12 కోట్లు, మద్నూర్ ఏఎంసీకి రూ.51 లక్షలు మంజూరు అయ్యాయని వెల్లడించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జిల్లా మీదుగా మరో కొత్త రైల్వే లైన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పటాన్‌చెరు నుంచి ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ వరకు కొత్త రైల్వే లైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త లైన్ నిర్మాణం పూర్తయితే ప్రయాణికులకు మరింత సౌకర్యం కలుగనుంది.

- అక్షరటుడే, ఇందూరు



# జిల్లాకు మరో రైల్వే లైన్

▸ పటాన్‌చెరు టు ఆదిలాబాద్ కొత్త మార్గం ▸ నిజామాబాద్ జిల్లా మీదుగా నిర్మాణం ▸ ఫలించిన ఎంపీ అర్వింద్ కృషి

ఉమ్మడి జిల్లాలో రైల్వే లైన్ల విస్తరణకు సంబంధించి మరో ప్రాజెక్ట్‌కు ముందడుగు పడింది. జిల్లా మీదుగా నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో కొత్త లైన్ అందుబాటులోకి వస్తే మరింత సౌకర్యవంతంగా మారనుంది. పటాన్‌చెరు, ఆదిలాబాద్ మధ్య ఆర్మూర్ మీదుగా రైల్వేలైన్ వేయాలని ఎంపీ అర్వింద్ రెండేళ్లుగా రైల్వే మంత్రిని పలుమార్లు కోరారు. దీంతో తాజాగా ఈ ప్రాజెక్టును మంజూరు చేసినట్లు రైల్వే మంత్రి ఎంపీ అర్వింద్‌కు లేఖ రాశారు. కాగా.. కొత్త రైల్వే లైన్ పూర్తయితే ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు సులువు కానుంది.

### డీపీఆర్ తయారీ

ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు ఎంపీ అర్వింద్‌కు రాసిన లేఖలో రైల్వే మంత్రి అశ్విని వైషన్ తెలిపారు. డీపీఆర్ పూర్తయిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కాగా.. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి ఉత్తర తెలంగాణలో ముఖ్యమైన నూతన రైల్వే లైన్ మంజూరు చేసినందుకు ఎంపీ అర్వింద్ కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఎంపీ అర్వింద్ కృషి

రైల్వే లైన్ మంజూరుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా కృషి చేశారు. ఈ మేరకు పలుమార్లు ఆయన రైల్వేశాఖ మంత్రిని కలిసి విన్నవించారు. ఈ క్రమంలో తాజాగా రైల్వేశాఖ మంత్రి రైల్వే లైన్ మంజూరు చేశారు. అంతేగాకుండా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఆర్వోబీల నిర్మాణం విషయంలో సైతం ఎంపీ తీవ్రంగా కృషి చేశారు. ఈ క్రమంలో పలు ఆర్వోబీల నిర్మాణం పూర్తి కాగా.. కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి.



## కురిసిన వాన.. మురిసిన రైతన్న

కామారెడ్డి జిల్లాలో రెండు రోజుల నుంచి వర్షం కురుస్తుండడంతో రైతన్నలు మురిసిపోతున్నారు. లింగంపేట మండలంలో రైతులు ఎక్కువమొత్తంలో రైతులు వరిసాగుపైనే ఆధారపడ్డారు. ఇన్నాళ్లు వానల్లేక ఆందోళనకు గురైన రైతులు మంగళవారం రాత్రి కురిసిన వర్షా నికి సంబురపడ్డారు. దీంతో ఆయా గ్రామాల్లో చెరువుల కింద పంటలను సాగు చేసేందుకు, వరినాట్లు వేసేందుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. - అక్షరటుడే, లింగంపేట



## జీజీహెచ్‌లో మొరాయించిన లిఫ్ట్

▸ అరగంట పాటు చిక్కుకుపోయిన రోగులు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా జనరల్ ఆస్పత్రిలో బుధవారం లిఫ్ట్ మొరాయించింది. ఆస్పత్రిలో పైఅంతస్తు నుంచి కింది అంతస్తుకు రోగులు, వారి బంధువులు కిందికి వచ్చే సమయంలో అర్ధాంతరంగా మధ్యలోనే లిఫ్ట్ నిలిచిపోయింది. సుమారు అరగంట పాటు అందులో ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు లిఫ్ట్‌లో ఉన్న వారిని అతికష్టంమీద బయటకు తీసుకొచ్చారు. అయితే లిఫ్ట్‌ల నిర్వహణ విషయంలో అలసత్వంతోనే అప్పుడప్పుడు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని చర్చించుకుంటున్నారు. కొన్నేళ్లుగా జీజీహెచ్‌లో లిఫ్ట్‌ల సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీంతో నిత్యం రోగులు అవస్థలు పడుతున్నారు. లిఫ్ట్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఇదంతా జరుగుతోందని అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవట్లేదని రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు.

## తెయూలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ యాదగిరిరావు

**అక్షరటుడే, ఇందల్వాయి:** తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ యాదగిరిరావు, అర్థశాస్త్ర హెచ్‌వోడీ పున్నయ్య సంభాషణ సమాలోచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ ఆచార్యులు తరగతి గదికి మాత్రమే పరిమితం కాకుండా సామాజిక మార్పు కోసం సంప్రదాయ విధానాలకు భిన్నంగా అధ్యాపనలో విభిన్న కోణాలు ఎంచుకోవాలన్నారు. తదనుగుణంగా తమదైన మార్గంలో అభివృద్ధి దిశగా ముందుకెళ్లడం ఆవశ్యకమన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి మాట్లాడుతూ.. పున్నయ్య రచనలు అనేక ఆర్థిక సామాజిక అంశాలను స్పృషిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ సర్కారు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

**అక్షరటుడే, బాన్సువాడ:** రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కారు అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం నిర్వహించిన మహాలక్ష్మి సంబరాల్లో ఆయన మాట్లాడారు. మహిళ సంక్షేమమే ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, రెగ్యులర్‌గా ఆర్టీసీలో ప్రయాణించే మహిళలు, విద్యార్థినులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిపో మేనేజర్ సరిత దేవి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్, నార్ల సురేష్, అంజిరెడ్డి, దావుద్, ఆర్టీసీ సిబ్బంది బసంత్ పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎనలేని కృషి



సంబురాల్లో పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అధికారులు

**అక్షరటుడే, ఇందూరు/ఆర్మూర్:** మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకున్న సందర్భంగా బుధవారం ఆర్మూర్ బస్టాండ్ లో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో 5.54 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకోసం రూ.230 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని తెలిపారు. అలాగే మహిళ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో నిజామాబాద్ రీజియన్ పరిధిలో కొత్తగా 141 బస్సులను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్, ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న, ఆర్మూర్ డిపో మేనేజర్ రవికుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, లింగంపేట:** భారీ వర్షాలు కురిస్తే వరదలు వచ్చే ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. తాడ్వాయి మండలంలోని సంతాయిపేట భీమేశ్వర వాగు పరిసర ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో గతంలో వరదలో చిక్కుకొని రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. ఈ యేడు అలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను ముందే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గతేడాది వరదలో చిక్కుకోవడంతో హెలికాప్టర్ ద్వారా రైతులను గట్టుకు చేర్చిన సంగతి తెలిసిందే. భారీ వర్షాలు కురిసన సమయంలో రైతులు, ప్రజలు ఎవరూ కూడా లోతట్టు ప్రాంతాల్లో గాని వరదల్లో చిక్కుకోకుండా పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట సీఐ, ఎస్సై మురళి ఉన్నారు.



## ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సంబురాల్లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వం మహాలక్ష్మి స్కీం ద్వారా ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు పథకాన్ని 200 కోట్ల మంది మహిళలు ఉపయోగించుకున్న నేపథ్యంలో బుధవారం కామారెడ్డి బస్ స్టేషన్‌లో నిర్వహించిన మహాలక్ష్మి సంబరాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జులై 23 నాటికి 200 కోట్ల మహిళలు ప్రయాణించి సుమారు రూ.6,700 కోట్ల ఆదా చేసుకున్నారని తెలిపారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కామారెడ్డి ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆరు స్పెషల్ టూర్ ప్యాకేజీ కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేష్ చంద్ర, ఆర్టీసీ డీఎం కరుణశ్రీ, ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆర్డీవో వీణ ఇతర అధికారులు పాల్గొన్నారు. మొక్కల సంరక్షణ బాధ్యత అందరిదని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం దేవునిపల్లి ప్రాథమిక పాఠశాల, యోగా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో డీఈవో రాజు, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎంఈవో, ఎల్లయ్య క్వాలిటీ కో-ఆర్డినేటర్ వేణుగోపాల్, కాంప్లెక్స్ హెచ్ఎం గంగాకిషన్, యోగా పరిషత్ అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి రఘుకుమార్, సురేందర్, వెంకటేశం, సిద్దాగౌడ్ పాల్గొన్నారు.

## సభను విజయవంతం చేయాలి



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో ఈనెల 25న తలపెట్టిన ఆత్మగౌరవ సభను సక్సెస్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. నాగిరెడ్డిపేట మండలం కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగంపేట్ లో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే ఆత్మగౌరవ సభకు బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాక అధ్యక్షుడు కేటీఆర్, రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీమంత్రి ప్రశాంత్ రెడ్డి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, సిద్దయ్య, వంశీ పాల్గొన్నారు.

## రాంపూర్(కలన్)లో రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలం రాంపూర్(కలాన్) లో బుధవారం లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మందడి బలరాం రెడ్డి మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు ఆదేశాల మేరకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు లక్ష్మయ్య, కటేపల్లి రాజు, లింగారెడ్డి, జలంధర్ గౌడ్, జంబూ రెడ్డి, పెద్ద బోయిన లక్ష్మయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## ప్రబలిన అతిసారా.. ఇద్దరు మృతి

**అక్షరటుడే, లింగంపేట:** తాడ్వాయిలో డయేరియా కలకలం రేపింది. అతిసార కారణంగా ఇద్దరు మృతి చెందిన ఘటన తాడ్వాయి మండలం దేమికలాన్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో వారంరోజుల నుంచి వాంతులు విరేచనాలతో బాధపడుతూ పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఉన్నారు. వారిలో ఇద్దరు బుధవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన కొనింటి భూమయ్య(70), మెట్టు స్వామి(35) డయేరియా కారణంగా మృతి చెందారు.

### కలుషిత నీరా.. ఆహారమా..?

గ్రామంలో డయేరియా విజృంభించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. కలుషిత ఆహారం, కలుషిత నీరుతో జరిగిందా లేదా ఇంకేమైనా జరిగి ఉంటుందా అని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. వెంటనే గ్రామంలో వైద్యసిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గ్రామంలో ఏకకాలంలో ఇద్దరు మృతిచెందడంతో భయాందోళనకు గురవుతున్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. ఆదివారం రాత్రి కుమార్‌గల్లీ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించగా పాములబస్తీకి చెందిన శివకుమార్ అధికంగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. మంగళవారం న్యాయస్థానం ఎదుట హాజరుపర్చగా అతడికి రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. ఇలా తాగి వాహనాలు నడిపితే.. వారికే కాకుండి ఇతరులకు కూడా ప్రమాదాలు పొంచి ఉంటాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని.. వారు వాహనాలు నడిపితే మైనర్ల తల్లిదండ్రులపై కేసులు పెడతామని ఎస్‌హెచ్‌వో స్పష్టం చేశారు.

# బ్రాండెడ్ పేరిట.. కల్తీనూనె విక్రయం







■ లాభాల కోసం ప్రజలకు అంటగడుతున్న వైనం ■ ఫ్యాక్టరీ విషయమే తెలియదంటున్న అధికారులు

**కామారెడ్డి కేంద్రంగా కల్తీ నూనె దందా యథేచ్ఛగా సాగుతోంది. దీంతో ప్రజలు ఏ నూనె కల్తీదో.. ఏది అసలుదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. అక్రమార్కులు బ్రాండెడ్ ఆయిల్ పేరిట కల్తీ నూనెను ప్రజలకు అంటగడుతున్నారు. కల్తీ నూనెతో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. అసలు ఆ కంపెనీ ఎక్కడుందో తెలియదని చెబుతుండటం గమనార్హం.** **- అక్షరటుడే, కామారెడ్డి**

మార్కెట్‌లో చాలా రకాల నూనెలు అందుబాటులో ఉన్నాయి. వివిధ కంపెనీల నూనెలను దుకాణదారులు విక్రయిస్తున్నారు. అయితే కల్తీ మాఫియా బ్రాండెడ్ కంపెనీల స్టిక్కర్లు వేసి నకిలీ ఆయిల్‌ను మార్కెట్‌లో ప్రవేశపెడుతోంది. ముందుగానే రిటైల్, హోల్ సేల్ వ్యాపారులకు తాము సరఫరా చేసిన ఆయిల్‌ను ఇదే ఒరిజినల్ అని చెప్పి ఎక్కువగా విక్రయించాలని సూచిస్తున్నట్లు సమాచారం. తక్కువ ధరకు వ్యాపారులకు వీరు కల్తీ నూనె సరఫరా చేస్తున్నారు. దీంతో వారు లాభాలు వస్తాయని ప్రజలకు అంటగడుతున్నట్లు తెలిసింది. జిల్లాలో లభించే ఆయిల్ టిన్లపై రెండు వేర్వేరు అడ్రస్‌లు ఉండడం గమనార్హం. కొన్నింటిపై తెలంగాణలో తయారు చేసినట్లు ఉండగా.. మరి కొన్నింటిపై ఆంధ్రలో తయారు చేసినట్లు ఉంది.

### రంగు కోసం రసాయనాలు

జిల్లా కేంద్రం అడ్డాగా కల్తీ వ్యాపార సామ్రాజ్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కల్తీ నూనె తయారు చేస్తున్న ఫ్యాక్టరీకి ఎడిబుల్ ఆయిల్ వస్తుండగా దానిలో విటమిన్ ఏ, డీకి సంబంధించిన లిక్విడ్ కలుపుతున్నారు. ఫ్యాక్టరీకి వచ్చిన ఎడిబుల్ ఆయిల్‌లో తాము అనుకున్న కంపెనీ ఆయిల్ కలర్ రావడం కోసం రసాయనాలు మిక్స్ చేస్తున్నట్లు సమాచారం. రసాయనాలు కలిపి ప్రజలు గుర్తించని విధంగా రంగును మారుస్తూ మార్కెట్లోకి సరఫరా చేస్తున్నారు. దాంతో అదే నిజమైన ఆయిల్ అనుకుని ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

### ఫ్యాక్టరీ సంగతి తెలియదు

కామారెడ్డి కేంద్రంగా కల్తీ నూనె తయారవుతున్న విషయం తమకు తెలియదని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. ఆ ఫ్యాక్టరీ ఎక్కడుంది.. దాని యజమాని ఎవరు.. ఎక్కడెక్కడ సరఫరా చేస్తున్నారని వారు తిరిగి ప్రశ్నిస్తున్నారు. కాగా అధికారులు ప్రతి నెలా మామూళ్లు అందుతుండటంతోనే సైలెంట్‌గా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. కల్తీ నూనె తయారుదారులపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అలాగే కల్తీ నూనెను ఎలా గుర్తించాలో ప్రజలకు అవగాహన కూడా కల్పించడం లేదు.



పిట్లం మండల కేంద్రంలో..



గాంధారి మండల కేంద్రంలో..

## స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

**స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ కార్యకర్తలు శాయశక్తులా కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు బాన్సువాడ, గాంధారి, పిట్లం, పోతంగల్, తదితర మండలాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల సందర్భంగా కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.**



పోతంగల్ మండల కేంద్రంలో..



బాన్సువాడ మండల కేంద్రంలో..

## డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు



బాన్సువాడలో భాస్కర్ రెడ్డికి కేక్ తినిపిస్తున్న తల్లి



కోటగిరిలో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కార్యకర్తలు

**అక్షరటుడే, బాన్సువాడ :** డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాన్సువాడలో తల్లిదండ్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పుష్ప ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.

**కోటగిరి మండల కేంద్రంలో..**

**అక్షరటుడే, కోటగిరి :** మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు, పండ్లు పంచిపెట్టారు. అనంతరం మైనార్టీ స్కూల్ లో విద్యార్థులకు అరటి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంత్, మాజీ జెడ్పీటీసీ శంకర్ పటేల్, మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, సిరాజ్, ఏజాజ్ ఖాన్, వర్ని శంకర్, జుబేర్, మాణిక్ అప్ప, రాజు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన యావరేశెట్టి గంగ నర్సయ్య(60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మృతుడు నర్సయ్య 44వ హైవే పక్కన పెట్రోల్ బంక్‌లో పని చేస్తుండగా, మంగళవారం రాత్రి పని ముగించుకుని బైక్‌పై గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దమ్మ గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన పలువురికి జైలు

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి వాహనం నడిపిన ఆరుగురికి జైలు శిక్షతోపాటు మరో 23 మందికి జరిమానా విధించారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిని 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చగా 23 మందికి రూ.30వేల జరిమానా విధించారు. మరో ఆరుగురికి రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చిందని ఏసీపీ వివరించారు. నగరంలోని వన్ టౌన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి న్యాయస్థానం జైలుశిక్ష విధించిందని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఆదివారం రాత్రి కుమార్‌గల్లీ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించగా పాములబస్తీకి చెందిన శివకుమార్ అధికంగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. మంగళవారం న్యాయస్థానం ఎదుట హాజరుపర్చగా అతడికి రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ పేర్కొన్నారు. ఇలా తాగి వాహనాలు నడిపితే.. వారికే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదాలు పొంచి ఉంటాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని స్పష్టం చేశారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



**అక్షరటుడే, బాన్సువాడ:** ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ జుబేర్ అన్నారు. నస్రుల్లాబాద్ మండలకేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత మొదలైందని, ఏ గ్రామంలో చూసినా కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి నిలబెట్టే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు నర్సింలు గౌడ్, సాయిలు, వెంకటరాములు, శంకర్, మోసిన్, లక్ష్మణ్, రాజు, రమేష్, సాయిలు, రేహాన్, గంగాధర్, రమేష్ యాదవ్, సాయిబాబా, కృష్ణ, శివ సూరి, సంజయ్ యాదవ్, గోపాల్ పాల్గొన్నారు.

## వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ సూచించారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణతోపాటు, రాజారాంనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా పలుచోట్ల నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఓంకార్, నవీన్, ప్రకాష్ తదితరులున్నారు.

## ఆరోగ్య కార్డు ట్రయల్ సర్వే



**అక్షరటుడే, ఇందల్వాయి:** ఇందల్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య కార్డు ట్రయల్ రన్ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా అసంక్రమిత వ్యాధులైన హైపర్ టెన్షన్, డయాబెటిక్, క్యాన్సర్, పాల్యేటివ్ కేర్ లాంటి వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటింటికి వెళ్లి బీపీ, ఆర్‌బీఎస్ (డయాబెటిక్) పరీక్ష, బరువు, ఎత్తు, నోటి, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వారి ఆహార అలవాట్లు, తదితర అంశాలపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాలం ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాందేవ్ మహారాజ్ పుణ్యతిథి



**అక్షరటుడే,కోటగిరి:** పోతంగల్ మండలంలోని దోమలెడ్గిలోని విఠలేశ్వర మందిరంలో నాందేవ్ మహారాజ్ పుణ్యతిథి, ఆలయ రెండో వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. మేరుకు కులస్థుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి పుణ్యతిథి వేడులకు జరిపించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. 9 గంటలకు కామప్ప మహారాజ్ ఆధ్వర్యంలో భజన కీర్తనలు నిర్వహించారు. భగవంతుడికి నైవేద్యం పెట్టిన మహాభక్తుడు నాందేవ్ మహారాజ్ అని ఆయన పేర్కొన్నారు. 12 గంటలకు గులాలు నిర్వహించి ప్రధాన వీధుల ద్వారా పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గంట్ల రవి కుమార్, జెల్లా గంగాధర్, శ్రీధర్, విఠల్, రాములు, మేరు బంధువులు పాల్గొన్నారు.